క్లుప్తంగా

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఆర్టీసీ బస్సులతో పాటు, ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. 10 వేల మంది భక్తులు హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ సంస్థవారు ప్రత్యేక బస్సులను నడిపారు.

'రఘును వెంటనే విడుదల చేయాలి'

మన్ననూర్: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దంతెవాడలో గత నెల 27వ తేదీన అక్రమంగా అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్ నేత రఘు మీడియామిని వెంటనే విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభాన్, జక్క బాలయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో 35 ఆదివాసి సంఘాలకు నేతృత్వం వహిస్తున్న రఘు మీడియామిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదు. ఆదివాసి నివాస ప్రాంతాలలో కగార్ పేరుతో చేస్తున్న హత్యాకాండను ఆపాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉద్యమకారులపై తీవ్ర నిర్బంధం కొనసాగించి బూటకపు ఎన్‌కౌంటర్లు హత్యలు చేస్తున్నారని తెలిపారు. ఉద్యమ నేతను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తెలంగాణ పౌరహక్కుల సంఘం తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

'ఎన్నికల హామీలు నెరవేర్చాలి'

చారకొండ: ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రూ.రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బండపల్లి బాలస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. రైతు భరోసాను రైతులందరికీ ఏకకాలంలో జమ చేయాలన్నారు. ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై పూర్తి విచారణ జరిపించాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, దేవేందర్, రాములు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తాడూరు: మండలంలోని చెర్లఇటిక్యాల చెందిన కురుమయ్య (52) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కాంగ్రెస్ కార్యకర్తగా పార్టీకి ఎంతో సేవ చేశాడని, ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, రామకృష్ణ అన్నారు. మృతిడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున రూ. 10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, బద్రినాథ్, రామస్వామి, జైపాల్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ ఆదివారం పట్టణంలో పర్యటించారు. రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురై మరణించిన బుక్క వనజరెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. సోమశిలలో వనజరెడ్డి భర్త ఆర్‌ఐ గోవింద్ రెడ్డిని కలిసి సానుభూతిని తెలియజేశారు.

'పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి'

తెలకపల్లి: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు కేశవులుగౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రుణమాఫీ అయినా కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇంకా అప్పు చూపిస్తుందని వాపోయారు. రైతు భరోసా డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు: కేసు నమోదు

తిమ్మాజిపేట: మండలంలోని రాళ్లచెరువుతండా సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. దుందుభీ వాగు నుంచి డ్రైవర్ సూరి ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణగౌడ్ ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు చూపాలని కోరారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవరు ముడావత్ సూరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా మంత్రాలమ్మ షిడే వేడుకలు



షిడేపై కర్రకు వేలాడుతున్న రాముడు



షిడే ఉత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు

కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలసిన మంత్రాలమ్మ షిడే బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు షిడే కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సాయంత్రం కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రాలమ్మ తల్లికి ప్రతియేటా నిర్వహించే షిడే సందర్భంగా ఆదివారం భక్తులు పూనకాలు, బోనాలతో గుడిచుట్టు ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కర్రకు పర్లగొర్ల వంశస్తుడైన 70 ఏళ్ల రాముడిని తాడుతో గుడి చుట్టు తిప్పారు.

భారీ బందోబస్తు

మంత్రాలమ్మ షిడే సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా ఎస్‌ఐ గోకారి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు షిడే కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై మొక్కులను తీర్చుకున్నారు.



మిఠాయి దుకాణంలో స్వీట్లు కొంటున్న భక్తులు



గాజులు కొంటున్న మహిళలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: మహనీయులైన కాన్షీరాం, మహాత్మా జ్యోతిబాపులే, బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని బీఎస్పీ నాయకులు పృథ్వీరాజ్, రాంచందర్, అంతటి నాగన్న తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మార్చి 15న బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్సీరాం 91వ జయంతి, భారతదేశ సాంఘిక విప్లవకారులు మహాత్మా జ్యోతిబాపులే 198వ జయంతి, ఏప్రిల్ 14 అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆధిపత్య పార్టీలలో బహుజనులకు తరతరాలుగా అన్యాయం జరుగుతుందని, బహుజన రాజ్యాధికారం ద్వారానే రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం లభిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో బహుజనులు రాష్ట్రాన్ని, దేశాన్ని పాలించే విధంగా రాజకీయాలు చేయాలని పిలుపునిచ్చారు.

కుట్టు మిషన్లు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు




కుట్టు మిషన్లు తీసుకుంటున్న ముస్లిం మహిళలు

కందనూలు: ముస్లిం మైనారిటీల కోసం 800 కుట్టు మిషన్లు ఆదివారం వనపర్తిలో జరిగిన బహిరంగ సభలో మంజూరు చేయడం హర్షనీయమని నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.హబీబ్ ఉర్ రెహమాన్ అన్నారు. నియోజకవర్గానికి 200 చొప్పున కుట్టుమిషన్లు నిరుపేద ముస్లిం మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. కుట్టుమిషన్లు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండాల కోనేరు వద్ద పోలీస్ పహారా

వెల్దండ: వెల్దండ మండలంలోని గుండాల శ్రీ అంబారామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోనేరు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా కోనేరులో స్నానానికి వెళ్లి విద్యార్థులు నీట మునిగి మృతి చెందారు. కోనేరు లోతు ఎక్కువగా ఉండడంతో.. వెల్దండ ఎస్‌ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులను కోనేరులో దిగకుండా నిలువరిస్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. భక్తులు పరిస్థితులను అర్థం చేసుకోని జాగ్రత్తలను పాటించాలని కోరారు.



వెల్దండ మండలం గుండాల కోనేరు వద్ద పోలీస్ బందో బస్తు నిర్వహిస్తున్న దృశ్యం.

నేడు గుండాల ఆలయంలో శాంతి పూజ

గుండాల ఆలయంలో సోమవారం శాంతిపూజ నిర్వహిస్తున్నట్లు ఈఓ ప్రసాద్ ఆదివారం తెలిపారు. మహాశివరాత్రి రోజున కోనేరులో నీట మునిగి విద్యార్థి మృతి చెందడంతో శాంతిపూజ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శతాధిక ప్రతిష్టాచార్య శైవాగమ విశారధ బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతిశర్మ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు సంప్రోక్షణ కుంబాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. కావున ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు హాజరై శాంతిపూజను విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి



తాడూరు: మండల కేంద్రం నుంచి జిల్లాకు వెళ్లే ప్రధాన రోడ్డుకు అనుసరించి అసంపూర్తిగా వదిలిన డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు ప్రధాన రోడ్డు మీదకు చేరి దుర్గంధంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా విడుదలైన నిధులతోనైనా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. అధికారులు పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

సీఎం రాకతో ట్రాఫిక్ కష్టాలు



వనపర్తిలో నిలిపోయిన ట్రాఫిక్

- వ్యాపార సముదాయాలను మూయించిన పోలీసులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచే పోలీసులు పట్టణాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. సీఎం వల్లభ్‌నగర్, వేంకటేశ్వరస్వామి ఆలయానికి రావడంతో ఆ ప్రాంతాల నుంచి ప్రధాన మార్గాలకు వచ్చే రహదారులను బారికేడ్లతో మూసివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బస్టాండ్, రాజీవ్ చౌరస్తా, అంబేడ్కర్‌చౌక్, బస్ డిపో రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు మొదలుకొని ఆర్టీసీ బస్సుల వరకు రాకపోకలను నిలిపివేయడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. సీఎం పర్యటన వివరాలను ప్రజలు వీక్షించేలా పలు ప్రధాన చౌరస్తాలు, సభ స్థలంలో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడంతో వాటి ద్వారా సీఎం పర్యటనను ప్రజలు తిలకించారు.

వ్యాపారులకు తప్పని ఇబ్బందులు

పట్టణంలోని ప్రధాన రోడ్లు, చౌరస్తాల్లో ఉన్న వ్యాపార సముదాయాలను పోలీసులు పూర్తిగా మూసివేయించారు. ఆదివారం సంత కావడంతో పాటుగా సీఎం పర్యటన నేపథ్యంలో వ్యాపారం భారీగా జరిగే అవకాశం ఉందని టీ స్టాల్, టిఫిన్ సెంటర్లు మొదలుకొని అన్ని దుకాణాలను తెరిచారు. పోలీసులు అత్యవసర సేవలు అందించే దుకాణాలను మినహాయించి అన్నింటిని మూసేయడంతో వ్యాపారాలు ఏ మాత్రం చేసుకునేందుకు వీలులేకుండా పోయింది. గతంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమీప దుకాణాల వరకు మాత్రమే బంద్ చేయించేవారు. అందుకు భిన్నంగా వనపర్తిలో దాదాపు 60శాతానికి పైగా దుకాణాలు మూసివేయడంతో వ్యాపారులు ఇదేమీ చోద్యం అని పెదవి విరిచారు.



మూసివేసిన దుకాణాలు

400 కోట్ల నిధులు విడుదల చేయండి

గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో సీసీ డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణాలు మున్సిపాలిటీ పరిధిలో చేపట్టామని, ఇందుకు సంబంధించి రూ. 400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వనపర్తి మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. పెండింగ్‌లో ఉన్న నిధులను ఉగాదిలోపు విడుదల చేయించాలని ముఖ్యమంత్రిని కాంట్రాక్టర్లు అభ్యర్థించారు. దీంతో పాటుగా బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి నాయకులు సీఎంకు వినతి పత్రం అందజేశారు.

గుడ్లనర్వలో గంజాయి రాజ్యం

బిజినేపల్లి: మండలంలోని గుడ్లనర్వ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రాజ్యమేలుతోంది. గుడ్లనర్వ గ్రామంలో గంజాయి తాగుతున్న యువకులను స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రత్యేక నిఘాతో ఆదివారం పట్టుకున్నారు. కానీ ఈ విషయమై వారిని సంప్రదించగా వివరాలు వెల్లడించలేదు. కాగా ఇదే గ్రామంలో 2024, జూలై రెండో వారంలో ఇద్దరు యువకులు సిగరెట్లలో గంజాయి నింపుకొని తాగుతున్నారనే సమాచారంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. ఆ కేసులో సీఐ కనకయ్యగౌడ్ రెండు రోజుల పాటు లోతుగా విచారణ చేపట్టారు. కానీ ఏడాది కూడా తిరగక ముందే అదే గ్రామంలో గంజాయి తాగుతున్న యువకులను ఆదివారం అదుపులోకి తీసుకోవడంతో గంజాయి నిర్మూలనలో పోలీసుల వైఫల్యంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. పోలీస్‌శాఖ పూర్తి స్థాయిలో విచారణ చేయకపోవడమే కారణంగానే గంజాయిని గ్రామంలో నియంత్రించ లేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదలను ఆదుకోవడం అభినందనీయం

అచ్చంపేట రూరల్: నిత్యావసర సరుకులు అందజేసిన జుబేదా ఇస్లామిక్ వెల్ఫేర్ నిర్వాహకులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అభినందించారు. రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం పట్టణంలో 500 ముస్లిం కుటుంబాలకు రూ.12 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ రామనాథం, వాజిద్, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బల్మూర్: మండల కేంద్రంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌గౌడ్, రమేష్, శ్రీనువాసులు, చంద్రమౌళి, ఖదీర్, సైదులు, యాదవసంఘం నాయకులు మల్లయ్య, టీ.తిరుపతయ్య, రాములు, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

మన్ననూర్: లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఆలయం కమిటీ అధ్యక్షుడు ఇమ్మడి నరహరితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలం రాయలగండి క్షేత్రంలో సోమవారం నుంచి నిర్వహించే స్వామివారి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. 4న తెల్లవారు జామున స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తునట్లు తెలిపారు.

పారదర్శకంగా ప్రజాపాలన

- ఎస్‌ఎల్‌బీసీ వద్ద రేయింబవళ్లు సహాయక చర్యలు
- గతంలో ప్రతిపక్షాల గొంతునొక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: గత బీఆర్ఎస్ పాలనలో ప్రతిపక్షాలను అడుగడుగున నిర్బంధిస్తూ నిరంకుశ పాలన కొనసాగించారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పారదర్శకంగా ప్రజాపాలన కొనసాగుతుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం దోమలపెంటలోని జేపీ కార్యాలయం ఆవరణలో ఎస్ఎల్‌బీసీ వద్ద జరుగుతున్న సహాయక చర్యల గురించి వివరించారు. ఫిబ్రవరి 22న ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో జరిగిన దుర్ఘటనలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలను రక్షించడానికి సీఎం ఆధ్వర్యంలో నాటి నుంచి నేటి వరకు పాలనా యంత్రాంగం రేయింబవళ్లు పని చేస్తుందన్నారు. దేశంలోనే అత్యుత్తమ అనుభవం ఉన్న 12 సంస్థల ఉన్నతాధికారులతో పాటు సురక్షితులైన సిబ్బందితో కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తున్న సమయంలో ప్రతిపక్షాలు తమ ఉనికిని కాపాడుకునేందుకు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నాయని విమర్శించారు. ఇలాంటి ఆపద సమయంలో ప్రభుత్వానికి బాసటగా ఉండాల్సిన ప్రతిపక్షాలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు.

సింగోటం ఆలయ అభివృద్ధిపై చర్చకు రావాలి



మాట్లాడుతున్న సాయికృష్ణగౌడ్

కొల్లాపూర్: సింగోటం లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయ అభివృద్ధిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చర్చకు రావాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు తమటం సాయికృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన దేవాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీ కవిత సింగోటం ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి మంజూరైన రూ.15 కోట్ల నిధులను మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాన్సిల్ చేశారని ఆరోపించారు. ఇందులో వాస్తవమెంత అనే అంశాలపై కాంగ్రెస్ నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి మంజూరైన నిధులను క్యాన్సిల్ చేయించాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఆలయ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఆ నిధులను వెంటనే విడుదల చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. నిధుల మంజూరు, క్యాన్సిల్ అంశాలపై బహిరంగ చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్‌రావు, రాము, శివ తదితరులు ఉన్నారు.

మంత్రి జూపల్లిపై దుష్ప్రచారం చేయడం తగదు

కొల్లాపూర్: కోడేరు మండలం నార్యానాయక్ తండాలో దాయాదుల మధ్య భూ పంచాయితీ కోసం స్వల్ప ఘర్షణ జరిగితే దానిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు అంటగట్టడం బీఆర్ఎస్ నాయకులకు తగదని మాజీ జెడ్పీటీసీ హన్మంతునాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు జూపల్లిపై అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో నాయకులు శంకర్‌నాయక్, గోపినాయక్ తదితరులు ఉన్నారు.

పగిలిన పైప్‌లైన్.. తాగునీటికి ఇబ్బందులు



చిన్నకొత్తపల్లిలో పగిలిపోయిన పైప్‌లైన్

పెద్దకొత్తపల్లి: మండలంలోని చిన్నకొత్తపల్లిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. దీంతో మరమ్మతు చేయకపోవడంతో గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచింది. గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. 10 రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని వీధులలో ట్యాంకర్ నీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతు చేపట్టాలని అన్ని వీధులకు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు.


ఫీజుల కోసం విద్యార్థులపై వేధింపులు



మాట్లాడుతున్న ధారా శేఖర్

కొల్లాపూర్: ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ దారా శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కొల్లాపూర్‌లోని ఎస్టీ బాలుర మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో ఫీజుల కోసం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడాలన్నారు. ముందస్తు అడ్మిషన్లు స్వీకరిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అంజి, రాజేష్, లోకేష్, కార్తీక్, బాలు, తరుణ్, రంజిత్, తదితరులు ఉన్నారు.

బీటీకి నోచుకోని పోలోంపు రోడ్డు



కంకర తేలి గుంతలమయంగా మారిన మట్టి రోడ్డు

తాడూరు: మండల కేంద్రం నుంచి పోలోంపు మీదుగా ఇంద్రకల్, జిల్లా కేంద్రానికి అనువుగా 5 కిలోమీటర్లు ఉన్న మట్టిరోడ్డును బీటీగా మార్చాలని గ్రామస్తులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కోరారు. గత ప్రభుత్వ హయాంలోనే బీటీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వాటికి సంబంధించిన టెండర్లు కూడా పూర్తయ్యాయని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. పనులు చేపట్టడం లేదన్నారు. మట్టి రోడ్డుపై రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, వర్షాకాలం వస్తే ఈ రోడ్డు వెంట ప్రయాణం నరక యాతనగా మారుతోందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అయినా నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

పానగల్: గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గిరిజనులతో కలిసి ఉద్యమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్ అన్నారు. స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వేలో భాగంగా ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా, శాగాపూర్‌తండా, అన్నారంతండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాల్లో సరైన పనులు లేక గిరిజనులు వలసలు వెళ్తున్నారన్నారు. గిరిజనులకు కేటాయించాల్సిన బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిధులు కేటాయించడం లేదని వాపోయారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం ఎంపికైన లబ్ధిదారులకు నిధులు లేక నేటికీ రుణాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో బాబునాయక్, చిట్టెమ్మ, రవినాయక్ పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లితండాలో గిరిజన మహిళలతో మాట్లాడుతున్న బాల్యనాయక్